AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
5-3-2026 (Thursday) MAIN EDITION

## ట్రంప్‌కు షాక్.. టారిఫ్ డబ్బులు తిరిగివ్వాలన్న కోర్టు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కోర్టు షాక్ ఇచ్చింది. టారిఫ్‌ల పేరిట వివిధ దేశాల నుంచి వసూలు చేసిన డబ్బులను రీఫండ్ చేయాలని ఆదేశించింది. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత సంవత్సరం ప్రవేశపెట్టిన సుంకాలకు రీఫండ్‌లను జారీ చేయాలని యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ బుధవారం కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్‌ను ఆదేశించింది. డోనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల పేరుతో పలు దేశాలపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే.

## జిమ్ చేస్తూ హార్ట్ ఎటాక్‌తో ఉద్యోగి మృతి



**అక్షరటుడే, హైదరాబాద్:** జిమ్‌లో వ్యాయామం చేస్తూ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా కు చెందిన అనిల్ చౌదరి బేగంపేటలోని సైబర్ హిల్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఆయన నిత్యం జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేస్తాడు. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం సైతం జూబ్లీహిల్స్ రోడ్‌నంబర్ 36లోని ఈఎస్‌వైబీవో జిమ్‌కు వెళ్లాడు. గంట సేపు జిమ్ చేసిన తర్వాత అనిల్ వాష్ రూమ్‌కు వెళ్లాడు. అక్కడ కుప్పకూలిపోయాడు.

## మంత్రి వంగలపూడికి అస్వస్థత



**అక్షరటుడే, అమరావతి: ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అసెంబ్లీలో అస్వస్థతకు గురయ్యారు. పరీక్షించిన వైద్యులు బీపీ ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. అక్కడి నుంచి ఆమె చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి వెళ్లారు. అనంతరం తన ఆరోగ్యం బాగానే ఉన్నట్లు హోం మంత్రి అనిత వెల్లడించారు.**

## వార్ నష్టాలకు బ్రేక్..




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: యూఎస్‌తో షరతులతో కూడిన చర్చలకు ఇరాన్ సిద్ధమైనట్లు వచ్చిన వార్తలతో స్టాక్ మార్కెట్లు పరుగులు తీశాయి. దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం భారీ గ్యాప్ అప్‌లో ప్రారంభమైనా తీవ్ర ఒడిదుడుకుల మధ్య సాగింది. మధ్యాహ్నం 2.15 గంటల తర్వాత మార్కెట్లు కోలుకుని భారీ లాభాల దిశగా సాగాయి.**

## కశ్మీర్‌లో కొనసాగుతున్న ఆంక్షలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణంతో జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా బుధవారం కఠిన ఆంక్షలు కొనసాగాయి. శనివారం వరకు విద్యావ్యవస్థలను ప్రభుత్వం మూసివేసింది. మొబైల్ ఇంటర్నెట్ వేగం పైనా నియంత్రణ అమల్లో ఉంది. ప్రజలు గుమిగూడకుండా భద్రతా బలగాలు చర్యలు తీసుకుంటున్నాయి.**



## టెన్త్ హాల్‌టికెట్లు విడుదల

**అక్షరటుడే, హైదరాబాద్:** పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో ఈ నెల 14 నుంచే టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సెస్సీ బోర్డు పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేసింది. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ bse.telangana.gov.inలో అందుబాటులో ఉంచింది. తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (80969 58096) ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద కూడా హాల్‌టికెట్లను పొందవచ్చు.

## సీఎం పదవికి రాజీనామా చేయనున్న నితీశ్



**అక్షరటుడే, బీహార్:** బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసు కుంది. రెండు దశాబ్దాలకు పైగా సీఎంగా సేవలందించిన నితీశ్‌కుమా ర్ రాజీనామా చేయనున్నారు. ఆయన ను రాజ్యసభకు వెళ్తున్నారు. ఈ మేరకు నితీశ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్‌డీఏ కూటమి భారీ విజ యం సాధించిన విషయం తెలిసిందే. బీజేపీ 89, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించాయి. బీజేపీ ఎక్కువ సీట్లు సాధించిన ముందు చెప్పినట్లుగానే నితీశ్‌కుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించింది. అయితే తాజాగా రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. నితీశ్ కుమార్ పెద్దల సభకు వెళ్లనున్నారు.

**దేశంలో పలు రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నిక జరుగనుంది. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి ఇద్దరు సభ్యులు ఎన్నిక కానున్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఇద్దరు అభ్యర్థులను ఎంపిక చేసింది. కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ రెండో సారి నామినేషన్ వేశారు. అలాగే ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# నామినేషన్



- **రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్ వేసిన అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి**
- **పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి**

తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఈ మేరకు గురువారం ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్, పలువురు మంత్రులు హాజరయ్యారు.

### తెలంగాణ నుంచి రెండో సారి..

ఈ సందర్భంగా అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.


### చర్చలు, సంప్రదింపుల తర్వాత..

రాజసభ అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర కసరత్తు చేసింది. ఒక స్థానానికి ప్రస్తుతం సిటింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ ఎంపిక చేయగా.. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చలు, సంప్రదింపులు జరిగాయి. చివరకు వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు.

### ముఖ్యమంత్రి కోరిక మేరకు..!

వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరినట్లుగా తెలుస్తోంది. అందరితో సన్నిహితంగా ఉండడం.. ఎవరి నుంచి అభ్యంతరాలు రాకపోవడంతో అధిష్ఠానం సీఎం మాటకు ప్రాధాన్యం ఇచ్చి నరేందర్‌రెడ్డి పేరును ఎంపిక చేసింది. అయితే.. ఒకవేళ బీఆర్ఎస్ అభ్యర్థిని రంగంలోకి దింపినట్లయితే రెండో స్థానానికి పోటీ జరగనుంది. లేకపోతే రెండు స్థానాలను కాంగ్రెస్ దక్కించుకునే అవకాశం ఉంటుంది.

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియమా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు చేసుకుంటున్నాయి. తాజాగా లెబనాన్ సైతం రంగంలోకి దిగింది. ఇరాన్‌ఇజ్రాయెల్‌అమెరికా యుద్ధం ఆరో రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, జోర్డాన్, కుర్దిస్తాన్ భూభాగాలపై డ్రోన్లు, మిస్సైళ్లతో టెహ్రాన్ దాడులు చేసింది. మరోవైపు టెల్ అవీవ్ సైతం ప్రతిదాడులు చేస్తోంది. గురువారం ఉదయం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ మరో భారీ దాడి చేసింది. సైనిక స్థావరాలు, ఐఆర్‌జీసీ కమాండ్ సెంటర్‌లే లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించింది.

### విమానం కూల్చివేత

ఇరాన్ భూభాగంపై సుమారు 1600 సార్లు విమానాలతో ఐడీఎఫ్ దాడులు చేసింది. ఇరాన్ గగనతలంలో వైఏకే130 జెట్‌ను ఇజ్రాయెల్‌కు చెందిన ఎఫ్35 యుద్ధ విమానం కూల్చివేసింది. ఇజ్రాయెల్ ఇప్పటి వరకు 4 వేలకు పైగా బాంబులను ప్రయోగించగా.. ఇరాన్ 500 బాలిస్టిక్ క్షిపణులు, 2 వేల డ్రోన్లను ప్రయోగించింది.

ఉద్రిక్తతల నేపథ్యంలో ఖతార్ తమ ఎయిర్‌స్పేస్‌ను మూసి వేసింది. హమద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు దోహాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది.

## హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్**: హైదరాబాద్ నగరంలో మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వరుస ఫైర్ యాక్సిడెంట్లు ప్రజలను కలవర పెడుతున్నాయి. మంగళవారం రాత్రి బాచుపల్లిలో జరిగిన ప్రమాదంలో రూ.5 కోట్ల ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా నగరంలోని మైలార్‌దేవపల్లికాటేదాన్ ప్రాంతంలోని సుమిత్ టింబర్ డిపో, బీడీ ప్లైవుడ్ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. టింబర్ డిపోలో ఉన్న దుంగలు, కట్టెలకు మంటలు అంటుకుని తగలబడడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టింబర్ డిపో కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. టింబర్ డిపో కాలిబూడిద అవడంతో రూ.కోటి వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి వచ్చారు. రెండు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మళ్లీ అకాల వర్షాలు..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్** : రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే రాష్ట్రంలో మళ్లీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో గత నెలలో కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. మూడు రోజుల పాటు వానలు పడ్డాయి. అనంతరం ఎండలు పెరిగాయి. భానుడు భగభగ మండుతున్నాడు. పగటి పూట బయటకు వెళ్లాలేని పరిస్థితి. ఈ క్రమంలో వాతావరణ శాఖ అధికారులు చల్లని కబురు చెప్పారు. ఈ నెల 18 తర్వాత తెలంగాణలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఫిబ్రవరి 2324 తేదీల కంటే ఎక్కువగా వర్షాలు కురుస్తాయి. అక్కడక్కడ వడగళ్ల వానలు పడతాయి. మార్చి 18 వరకు వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. హైదరాబాద్ నగరంలో 3637 డిగ్రీలు, తూర్పు తెలంగాణ 3941 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మార్చి 18 తర్వాత వాతావరణం చల్లబడుతుంది.



## మరోసారి అందాలు ఆరబోసిన ఐశ్వర మీనన్

**అక్షరటుడే, సినిమాడెస్క్:** సినిమా ఇండస్ట్రీలో మంచి స్థాయికి చేరాలంటే ముఖ్యంగా కావాల్సింది అందం, నటన. కానీ అందం ఉన్నా సరైన విజయాలు లేక వెనకబడిపోయిన ముద్దుగుమ్మలు కూడా చాలామంది తెలుగు సినీ పరిశ్రమలో ఉన్నారు. అలాంటి వారిలో ఐశ్వర్య మీనన్ ఒకరు. ఈ బ్యూటీ నిఖిల్ హీరోగా రూపొందిన 'స్పై' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈమె నటించింది తక్కువ సినిమాలే అయినా అందులో తన అందాలతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అలాగే సోషల్ మీడియాలో కూడా ఎప్పటికప్పుడు తన అందాలతో కుర్రకారును ఊపేస్తోంది. ఇలా అందాలతో అలరిస్తున్న ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం పెద్ద స్థాయిలో దక్కడం లేదు.

## వైభవంగా అర్జున్ టెండుల్కర్ వివాహం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** సచిన్ టెండుల్కర్ తనయుడు అర్జున్ టెండుల్కర్ వివాహం గురువారం ముంబయిలో వైభవంగా జరిగింది. అర్జున్ తన స్నేహితురాలు సానియా చందోక్‌ను వివాహం చేసుకున్నాడు. ఆమె ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు. ఆమె కూడా వ్యాపారవేత్తగా రానిస్తోంది. ముంబయిలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. వివాహానికి ఐసీసీ ఛైర్మన్ జైషా, ఏపీ మంత్రి నారా లోకేశ్, టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు ఎం.ఎస్.ధోని, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, సురేశ్ రైనా, ఆకాశ్ చోప్రా తదితరులు హాజరయ్యారు.

## అణు క్షిపణిని పరీక్షించిన అమెరికా..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మధ్యప్రాచ్యంలో తీవ్రమైన యుద్ధం కొనసాగుతున్న సమయంలో కీలక పరిణామం జరిగింది. శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణిని యూఎస్ఏ పరీక్షించింది. మార్చి 3న పరీక్ష చేపట్టగా.. ఇందుకు సంబంధించిన వివరాలు బయటికొచ్చాయి. కాలిఫోర్నియా తీరంలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి మినిట్‌మ్యాన్3ను అమెరికా ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ పరీక్షలు చేసింది. మంగళవారం రాత్రి 11 గంటలకు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా.. ఆయుధాలు లేని ఈ ఖండాంతర క్షిపణి మార్షల్ ఐల్యాండ్స్‌లో లక్ష్యాన్ని ఛేదించినట్లు స్పేస్‌ఫోర్స్ తెలిపింది. ఈ పరీక్ష విజయవంతమైందని, కచ్చితత్వంతో క్షిపణి లక్ష్యాన్ని చేరుకుందని వెల్లడించింది. కాగా.. ఇరాన్‌పై దాడులు చేస్తున్న సమయంలో ఈ పరీక్షలు నిర్వహించడం గమనార్హం.